క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్/ఖమ్మంసహకారనగర్: నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. సంతోష్ సేవా చారిటబల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జరుగుతున్న ఈ పోటీలను శనివారం ట్రస్ట్ చైర్మన్ మురళీకృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు చింతనిప్పు కృష్ణచైతన్యలు ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 40 జట్లు పాల్గొనున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు సాయికృష్ణ, గోపి, వెంకటేష్, మహేష్, సాయి భరత్‌లు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

రఘునాథపాలెం: గ్రామ పంచాయతీ కార్మికులకు దసరా, దీపావళి కల్లా పెండింగ్ జీతాలు చెల్లించి వేడుకలు నిర్వహించుకునేలా చేయాలని శనివారం ఏఐటీయూసీ గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి పిట్టల మల్లయ్య కోరారు. ఈమేరకు శనివారం కలెక్టర్ కార్యాలయంలో ఏఓ అరుణకు వినతి పత్రం అందించారు. నాయకులు గుగులోతు రామదాస్, ప్రసాద్, సీతారాములు బద్రు, సందీప్, సైదులు, లాలు, వీరన్న, వస్త్రం పాల్గొన్నారు.

సన్మానం..

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన యలమద్ది వెంకటేశ్వరరావును రఘునాథపాలెం మండల పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. శనివారం జరిగిన సమావేశంలో రఘునాథపాలెం మండల శాఖ నుంచి జిల్లా ఉపాధ్యక్షులుగా సతీష్, ఎ.సోమల, జిల్లా కార్యదర్శులుగా శ్రీనివాసరావు, గిరిజాదేవిలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతామని మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేశవరావు, తూమాటి సైదుబాబులు పేర్కొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ఖమ్మంలీగల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కల్గి ఉండాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కే.వీ.చంద్రశేఖర్‌రావు అన్నారు. శనివారం నగరంలోని బాలాజీనగర్‌లో గల బాలల సదనాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బాలికలకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు, బాలల సదనం పర్యవేక్షణాధికారి వరలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

'కాటమయ్య' కిట్ల పంపిణీ

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో గీత కార్మికులకు కాటమయ్య రక్ష కవచం వినియోగంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ కె.జగన్నాధరావు మాట్లాడగా.. కాటమయ్య రక్ష కవచం కో–ఆర్డినేటర్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, బీసీ వెల్ఫేర్ మండల అధికారి సౌజన్య, గీత కార్మికులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంమామిళ్లగూడెం: ఈ నెల 7వ తేదీ వరకు రుణమాఫీ పొందని రైతులు దరఖాస్తు చేసుకోవాలని అంతర్జాతీయ గాంధీ పథం అధ్యక్షుడు డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి కోరారు. రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు ఆధార్‌కార్డు, సంబంధిత బ్యాంకు ఖాతా నంబర్ తదితర వివరాలను సమర్పించి ఫొటో దిగాలని సూచించారు.

రక్తదాన శిబిరం

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెంలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం సీపీఐ ఆధ్వర్యాన శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ.గౌస్‌పాషా మాట్లాడగా.. కార్యక్రమంలో సీపీఐ నాయకులు అండగాల శ్రీను, మారుతి వెంకటరమణ, రాజు, లక్ష్మణ్, గూటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే..

కామేపల్లి: మండలంలోని కొమ్మినేపల్లి గ్రామ పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ఆధ్వర్యాన ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సేకరించిన నివేదికనను, ఎమ్మెల్యే కనకయ్య, మంత్రుల దృష్టికి తీసుకెళ్తానని మల్లిబాబు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శీలం పుల్లయ్య, గుగులోత్ రవి, పాటిబండ్ల ప్రసాద్, భూక్యా నాగేంద్రబాబు, మేకల మల్లిఖార్జున్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం మామిళ్లగూడెం: శ్రీలక్ష్మి సమ్మక్క క్రియేషన్స్ ఆధ్వర్యాన నిర్మించిన ఆడ శివంగి సినిమా పోస్టర్లను శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. దర్శకుడు కృష్ణ, వెంకటేశ్వర్లు, హిరో నాని, హిరోయిన్ గౌతమి, నటులు లక్ష్మణచారి, కోటయ్య, శోభన, ప్రవీణ్, రాథోడ్, కవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ జేఏసీ నిరసన

ఖమ్మంవ్యవసాయం: రామగుండం థర్మల్ పవర్ స్టేషన్ నూతన నిర్మాణంలో సింగరేణిని భాగస్వామ్యం చేయడాన్ని నిరసిస్తూ రెండో రోజు శనివారం జిల్లా టీజీ పీఈ జేఏసీ ఆధ్వర్యాన ఉద్యోగులు, కార్మికులు నిరసన చేపట్టారు. నగరంలోని సర్కిల్ కార్యాలయం ఎదుట మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన చేశారు. డీఈ హీరాలాల్, సీఏఓ శ్రీధర్, టి.శేషగిరిరావు, ఎం.ప్రసాద్, ఆర్.సత్యనారాయణ, బీంసింగ్, మమత పాల్గొన్నారు.

మధురం.. సీతాఫలం!



సీతాఫలాలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులు, రిటైల్ వ్యాపారులు



పేదోడి ఆపిల్‌కు పెరిగిన డిమాండ్

- పోషకాల సమాహారం, అనారోగ్యాల నివారిణి
- కాలక్రమేణ తగ్గుతున్న దిగుబడి
- ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి
- సైజును బట్టి ధరలు

సండే స్పెషల్

ఖమ్మంవ్యవసాయం: పేదోడి ఆపిల్‌గా పిలుచుకునే సీతాఫలానికి మార్కెట్ డిమాండ్ బాగా పెరిగింది. హిమ ప్రాంతాల్లో లభించే ఈ పండ్ల ధర ఎక్కువగా ఉండడంతో పూర్వం ధనికులే ఎక్కువగా కొనేవారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేద, మధ్య తరగతి వర్గాల వారికి ఆ కాలం నుంచి కొండలు, అడవులు, గుట్టలు, ఇంటి పెరట్లలో కూడా లభించడంతో ఈ ఫలాలను ఆపిల్ పండ్లుగా భావించి తింటుండడంతో దీనికి పేదోడి ఆపిల్‌గా పేరొచ్చింది. కాలక్రమేణ అడవులు అంతరిస్తుండడంతో అటు పశుపక్షాదు కే కాక ఇటు మానవ జాతికి సైతం దొరకకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఆపిల్‌కు ఉన్న ధరక కంటే సీతాఫలానికే డిమాండ్ ఎక్కువగా ఉంది. మార్కెట్ లభించే ఈ పండ్ల లభ్యత, ప్రయోజనాలు, వాటికున్న డిమాండ్ తదితర అంశాలపై 'సాక్షి'ప్రత్యేక కథనం..

మూడు నెలల పాటు లభ్యత..

శీతాకాలంలో వర్షాకాలం అంతం నుంచి మూడు నెలలు మాత్రమే లభించే పండు సీతాఫలం. అయితే ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు ఉండడంతో సీజన్‌కు 20 రోజుల ముందు నుంచే ఇవి మార్కెట్‌లోకి వచ్చాయి. తెలంగాణలో బతుకమ్మ పండుగ సీజన్ అంటే సెప్టెంబర్ నెలాంతం నుంచి ఈ ఫలాలు లభిస్తుండగా.. ఆయా ప్రాంతాలను బట్టి సీతాఫలం, రామ–లక్ష్మణ ఫలాలుగా పిలుస్తుంటారు. తెలంగాణ, ఉత్తరాంధ్ర, కర్ణాటక, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, కేరళ, మహారాష్ట్రల్లో ఈ పండ్లు ఎక్కువగా లభిస్తుంటాయి.

దివ్య ఔషద పండుగా..

సీతాఫలంలో అనేక రకాల పోషకాలు ఉంటాయి. వీటిలో ఉండే పిండి పదార్థాలు, ప్రోటీన్లు, పీచు పదార్థాలు, విటమిన్–సీతో పాటు కెరోటిన్, థైమీన్, రిబోఫ్లేవిన్, నియాసిన్ వంటి విటమిన్లు ఉంటాయి. దీన్ని తినడం ద్వారా జీర్ణక్రియ మెరుగుపడడం, ఎముకలు పటిష్టంగా ఉండడం, మల బద్ధకంతో బాధపడే వారికి దివ్య ఔషదంగా పనిచేస్తుంది. మధుమేహం, సెగ గడ్డలు, బరువు తగ్గించడానికి వాటి ఆకులు, బెరడు ఉపయోగపడతాయి.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి..

సీతాఫలాలు పూర్వం ఇల్లెందు, భద్రాచలం అటవీ ప్రాంతాల్లో లభించేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో సిద్దిపేట, గజ్వేల్, వికారాబాద్, మహారాష్ట్ర, జనగాం, మదనపల్లి ప్రాంతాలతో పాటు ఉత్తరాంధ్ర నుంచి కూడా దిగుమతి అవుతున్నాయి. అక్కడ పండించిన పంటను రైతులు, వ్యాపారులు మార్కెట్ల ద్వారా వివిధ ప్రాంతాలకు ఆర్డర్లపై విక్రయిస్తుంటారు. ఇలా ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అధిక ధరలకు అమ్ముతుండడంతో సామాన్యులు కొనే పరిస్థితి లేదు. దీంతో పేదవాడి సీతాఫలం ఆ పేదోడికే అందకుండా పోతోంది.

సైజు, డిమాండ్‌ను బట్టి ధర



సీతాఫలాల దిగుమతి..

సీతాఫలాలు సైజు, డిమాండ్‌ను బట్టి ధర నిర్ణయించి వ్యాపారులు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు వికారాబాద్, గజ్వేల్, సిద్దిపేట, మదనపల్లి, మహారాష్ట్ర వంటి మార్కెట్లలో 20 కిలోల బాక్స్‌ను రూ. 500 నుంచి రూ. 600 వరకు కొనుగోలు చేసి ఇక్కడ బాక్సు రూ. 700ల నుంచి రూ. 800ల వరకు విక్రయిస్తున్నారు. రిటైల్ వ్యాపారులు సైజును బట్టి డజను రూ. 150 నుంచి రూ. 300ల వరకు విక్రయిస్తున్నారు.

డిమాండ్ పెరిగింది..



కాలక్రమంలో సీతాఫలానికి డిమాండ్ పెరిగింది. పలు మార్కెట్లకు ఆర్డర్లు పెడుతున్నా పండ్లు సరిగా లభించడం లేదు. హైదరాబాద్ మహానగరంలో ఈ పండ్లకు బాగా గిరాకీ ఉంది. ఆర్డర్ చేసిన రెండు, మూడు రోజులకు ఇక్కడకు వస్తున్నాయి. ప్రస్తుతం ఏ ఫలానికి లేని డిమాండ్ సీతాఫలానికి ఉంది.

– అన్నపు మల్లిఖార్జున్, జైశ్రీరామ్ ఫ్రూట్ మర్చంట్, కస్బాబజార్

ప్రతీ సీజన్‌లో కొంటాం..



సీతా ఫలాలంటే ఎంతో ఇష్టం. అందుకే ప్రతి ఏటా మూడు కుటుంబాల వారు ఓ బాక్స్‌ను కొనుగోలు చేసి పంచుకుంటాం. సీతాకాలంలోనే ఇవి లభిస్తుండడంతో ధర ఎంతైనా కొనుగోలు చేసి తినక తప్పడం లేదు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో సైజులో లేవు. ఫలం సైజు ఎక్కువగా ఉంటే రుచికరంగా ఉంటుంది.

– శీలం కార్తీక్, కొనుగోలుదారుడు, నాయుడుపేట

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

శ్రీదేవి శరన్నవరాత్రులు పురస్కరించుకుని ఆలయాలు, మండపాల్లో కొలువుదీరిన అమ్మవారు శనివారం వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరూరల్: సాయిగణేష్ నగర్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన అన్నదానం



ఖమ్మంలోని శ్రీ పెద్దమ్మతల్లి దేవాలయంలో అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

'నూకల'కు పలువురి నివాళి



నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మంవన్‌టౌన్: అనారోగ్యంతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నూకల నరేష్‌రెడ్డి భౌతికకాయానికి ఆయన స్వగ్రామం మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, మాజీ ఎంపీ రామసహాయం సురేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామచంద్రనాయక్, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు మహ్మద్ ముస్తఫా, కమర్తపు మురళీ, తుపాకుల యలగొండల స్వామి, కొప్పుల చంద్రశేఖర్, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, రావెళ్ల కృష్ణారావు తదితరులున్నారు.

ప్రజా ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

కామేపల్లి: విప్లవ ప్రజా ఉద్యమాల ద్వారానే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామీణ పేదల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పడిగ యర్రయ్య అన్నారు. శనివారం మండలంలోని కొత్తలింగాలలో గ్రామీణ పేదల సంఘం మద్దులపల్లి ప్రాంతీయ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని భూదాన భూముల్లో ఇళ్ల స్థలాలు లేని పేదలు చేస్తున్న పోరాటాన్ని ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ప్రజలను నిర్బంధించాలని చూస్తుందని, ఆ భూముల సాధనకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నరాటి చంద్రమోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యూసీసీఆర్ఐ(ఎంఎల్) పార్టీ రాష్ట్ర నాయకులు పోలెబోయిన ముత్తయ్య, నాయకులు కల్తి రామచంద్రయ్య, కల్తి యర్రబాబు, రేగళ్ల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



శంకుస్థాపన చేస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి మార్కెట్ పునర్నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గతంలో మిగిలిపోయిన పనులను పరిశీలించి మాట్లాడుతూ.. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి పాలేరు నియోజకవర్గ రైతులకు అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం వరంగల్ క్రాస్‌రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు, కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, తేజావత్ పంతులునాయక్, బాణోత్ కిషోర్‌నాయక్, తిపిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రుణాల డాక్యుమెంట్లపై సీఓల సంతకం తప్పనిసరి

ఖమ్మంమయూరిసెంటర్: బ్యాంకర్లు మహిళా సంఘాలకు అందించే బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను మార్గదర్శకాలకు లోబడి మంజూరు చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య బ్యాంకర్లను, మెప్మా అధికారులను ఆదేశించారు. శనివారం కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సభ్యులకు ఇస్తున్న రుణాల్లో డాక్యుమెంట్లపై సీఓల సంతకం తప్పనిసరిగా ఉండాలని, ఆర్పీలు, మెప్మా సిబ్బందిపై సీఓలు, టీఎంసీ, డీఎంసీలు ఏమైనా ఇబ్బందులకు గురిచేస్తున్నారా? అని బ్యాంకర్లను ప్రశ్నించారు. దీనిపై బ్యాంకర్లు మాట్లాడుతూ.. ఒక్కో ఆర్పీ ఒక్క బ్యాంక్ పరిధిలో కాకుండా రెండు, మూడు బ్యాంక్‌ల పరిధిలో మహిళా సంఘాలకు రుణాలు ఇప్పిస్తుండడంతో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. ఈక్రమంలో ఇటీవల జరిగిన రుణాల మంజూరులో ఆర్పీల పాత్రతో పాటు సీఓలు, పై స్థాయి అధికారుల పాత్ర ఏమైనా ఉందా..? అనే అంశాలపై కమిషనర్ ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రతి నెలా బ్యాంకర్లు, మెప్మా అధికారులు చర్చించుకున్నాకే రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో బ్యాంకర్లు, టీఎంసీ, సీఓలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ట్రయథ్లాన్ పోటీలకు ఎంపిక

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థి విఘ్నేష్ రాష్ట్ర స్థాయి ట్రయథ్లాన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో అండర్–14 విభాగం నుంచి ప్రతిభ కనబర్చిన ఆయన హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా విఘ్నేష్‌ను ఆర్‌సీఓ రాణి, డీసీఓ జ్యోతిర్మయి, ప్రిన్సిపాల్ మల్లయ్య, ఏటీపీ లలిత, డిప్యూటీ వార్డెన్ శేషగిరి, పీఈటీ బ్రహ్మాచారి అభినందించారు.

'నిమ్స్' తరహాలో హాస్పిటల్ ఏర్పాటు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఆరోగ్య చికిత్సల కోసం నిత్యం వేలాదిమంది పేదలు ఖమ్మానికి వస్తుండగా.. నగరంలో హైదరాబాద్ నిమ్స్ తరహాలో నూతన హాస్పిటల్‌ను నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం టూ టౌన్ కమిటీ, బీవీకే కమిటీ ఆధ్వర్యాన నగరంలోని మంచికంటి హాల్‌లో శనివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఇండస్ ఆస్పత్రి వైద్యులు అల్లంపాటి రమేష్‌రెడ్డి, దినేష్‌కుమార్ రెడ్డి, గుర్రం వినీల్, మెడికల్ క్యాంపు రెగ్యులర్ డాక్టర్లు రావిళ్ల రంజిత్, కొల్లి అనుదీప్, పిల్లలమర్రి సుబ్బారావు, జెట్ల రంగారావు, వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, వై.శ్రీనివాసరావు, పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు పి.ఝాన్సీ, శివనారాయణ, వాసిరెడ్డి వీరభద్రం, నాగేశ్వరరావు, గుమ్మడి భిక్షం, పి.వాసు, పి.కష్ణారావు, టి.వెంకట్రావు, వి.మోహన్ పాల్గొన్నారు.

అప్రమత్తత అవసరం



పంపు ఆపరేటర్లకు వివరిస్తున్న డీఈఈ ఓం ప్రకాష్

నేలకొండపల్లి: గ్రామాల్లో తాగునీటి సరఫరాలో పంచాయతీ సిబ్బంది అప్రమతంగా ఉండాలని మిషన్ భగీరథ డీఈఈ ఓం ప్రకాష్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పంచాయతీ పంపు ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సరఫరా విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంపులు, బోరులు మరమ్మతులకు గురైనప్పుడు చేయాల్సిన పనులను శిక్షణ తరగతులలో నేర్పించబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, చేతి పంపు మెకానిక్ టి.నాగేశ్వరరావు, పంపు ఆపరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: మున్నేరు వరద తాకిడికి గురైన శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థలో పనిచేస్తున్న 32 మంది ఉద్యోగులతో పాటు మరికొంతమందికి శనివారం ఖమ్మం జోనల్ కార్యాలయంలో రూ.16 లక్షల విలువైన నిత్యావసర వస్తువులు సంస్థ ఆధ్వర్యాన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ తెలంగాణ ఉపాధ్యక్షుడు జి.నరసింహారావు మాట్లాడుతూ.. వరద బాధితుల సహాయార్థం సంస్థ తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.కోటి విరాళం అందజేసినట్లు తెలిపారు. సంస్థ సహాయ ఉపాధ్యక్షులు సురభి శేఖర్, శ్రీనివాసరెడ్డి, జనరల్ మేనేజర్ వాసుదేవరావు, డీజీఎం సుధాకర్, రామారావు, జగన్‌రెడ్డి, ఏజీఎం రాజ్‌కుమార్, ఇమాం పాషా, భక్తవత్సలరావు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ సొమ్ము రికవరీ చేయాలి

నేలకొండపల్లి: బోగస్ సర్టిఫికెట్‌తో పింఛన్ పొందుతున్న వారి వద్ద నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని, ఇందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలంగాణ దివ్యాంగులు జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తప్పుడు పత్రాలనుఅందించిన వైద్యులపై, ఇన్నాళ్లు పింఛన్ తీసుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని 58వ డివిజన్ రాపర్తినగర్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.10 కోట్లతో నిర్మించనున్న స్టోమ్ వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్లు నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో కొత్త కాలనీలు, ఇళ్ల నిర్మాణాలు పెరుగుతున్నందున అవసరమైన రహదారులు, డ్రెయిన్లు నిర్మించాల్సి ఉందన్నారు. ఇందులో భాగంగా దొరన్న కాలనీలో వసతుల కల్పనకు రూ.కోటి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే, ఖాళీస్థలాల యజమానులతో మాట్లాడి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కేఎంసీ మేయర్ నీరజ మాట్లాడగా.. కార్పొరేటర్ శ్వేత, సీనియర్ నాయకుడు రంగారావు, తహసీల్దార్ సీహెచ్.స్వామితో పాటు కమర్తపు మురళి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యనగర్ అయ్యప్ప ఆలయంలో హోమం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 10వ డివిజన్ చైతన్యనగర్ బైపాస్‌లో ఇటీవల నిర్మించిన శ్రీ ధర్మశాస్తా (అయ్యప్ప స్వామి) ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభం నిలబెట్టే వేడుకలు నిర్వహించడమే కాక స్వామి పంచలోహ విగ్రహం తయారీకి పోత పోయనున్నారు. ఈమేరకు శనివారం హోమం నిర్వహించినట్లు చైర్మన్ మేకల హన్మంతరావు తెలిపారు. ఈమేరకు పాకతిల్లం నారాయణన్ నంబూద్రి, తక్కే కోరమంగళం దామోదరన్ నంబూద్రి నేతృత్వాన పూజలు జరగగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయనను ఆలయ కమిటీ బాధ్యులు సన్మానించారు. కార్పొరేటర్లు చావా మాధురినారాయణరావు, సరిపూడి రమాసతీష్, కమర్తపు మురళి, మిక్కిలినేని మంజుల నరేంద్రతో పాటు రావూరి సైదబాబు, టీవీ.పుల్లరాజు, సరిపూడి నాగేశ్వరరావు, అట్లూరి మధు, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్/ఖమ్మంవ్యవసాయం: నగరంలోని 33 కేవీ, వీవీపాలెం ఫీడర్, సబ్‌స్టేషన్, 33 కేవీ టేకులపల్లి ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం అర్బన్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు వీవీపాలెం, నూతన కలెక్టరేట్, జీఆర్ఆర్ శ్రీనివాసమ్, చింతగుర్తి, గణేశ్వరం గ్రామాల పరిధిలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే నగరంలోని 33/11 కేవీ గాంధీ చౌక్ సబ్ స్టేషన్, 11 కేవీ మోతీనగర్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–1 సెక్షన్ ఏఈ ఎం.మౌలిక ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో దోబివాడ, పీఎస్ఆర్ రోడ్, కాల్వొడ్డు వీరాంజనేయ స్వామి టెంపుల్ రోడ్, మోతీనగర్, వాసవీ గార్డెన్స్ లైన్, పాత లారీ ఆఫీస్ లైన్, త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్, గాంధీనగర్, పంపింగ్‌వెల్‌రోడ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారుల సహకరించాలని ఏఈలు కోరారు.

'హార్వెస్ట్' విద్యార్థుల హవా



ప్రతిభ చూపిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్ రవిమారుత్

ఖమ్మం స్పోర్ట్స్: ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా తునిలో ఈ నెల 2 నుంచి 4వ తేదీ వరకు జరిగిన సీబీఎస్ఈ క్లస్టర్ మీట్‌లో భాగంగా బాలికల కబడ్డీ ఫైనల్స్‌లో నగరంలోని హార్వెస్ట్ స్కూల్ విద్యార్థులు జట్టు గెలుపొంది ఆల్ ఇండియా సీబీఎస్ఈ కబడ్డీ పోటీలకు అర్హత సాధించారు. దీంతో వీరు ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. అలాగే గత నెలలో హైదరాబాద్‌లోని బాచుపల్లి వీఆర్ విజ్ఞాన జ్యోతిలో జరిగిన ఖో–ఖో బాలికలు రజత పతకం, బాలుర కాంస్య పతకం దక్కించుకున్నారు. అంతేకాక నల్లగొండ అథ్లెటిక్స్ పోటీల్లో డి.నవ్య తృతీయస్థానం సాధించగా, గద్వాలలో కబడ్డీ పోటీల్లో జిల్లా బాలుర జట్టులో తృతీయస్థానం లభించింది. ఈమేరకు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డిలు క్రీడాకారులు, పీఈటీలను ప్రత్యేకంగా అభినందించారు.

నాలుగో రోజు బతుకమ్మ సంబరాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలు శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు బతుకమ్మలను తయారు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటి చుట్టూ తిరుగుతూ ఆడిపాడి సందడి చేశాక బతుకమ్మలను నిమజ్జనం చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంగాంధీచౌక్: 56వ డివిజన్ విజయనగర్ కాలనీలో వేడుకలో పాల్గొన్న మహిళలు



ఖమ్మంఅర్బన్: బొమ్మ కాలేజీలో బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



ఖమ్మం సహకారనగర్: వీడీవోస్ కాలనీలోని రెజొనెన్స్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

పని చేయట్లే..!



ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తాగు నీటి కోసం రోగులు అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రి ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ ఫ్రిజ్ గత రెండు రోజులుగా పని చేయక పోవడంతో ఆస్పత్రికి వచ్చే రోగులతో పాటు ఇన్‌పేషంట్ రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొందరు బయట నుంచి కొనుక్కుని వస్తుండగా.. మరి కొందరు మాతా శిశు ఆరోగ్య కేంద్రం నుంచి తీసుకువస్తున్నారు. ఇప్పటికై నా ఫ్రిజ్‌ను బాగు చేయించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని రోగులు కోరుకుంటున్నారు.